క్లుప్తంగా

పేకాట శిబిరాలపై దాడి

కూచిపూడి(మొవ్వ): మొవ్వ, పెడసనగంటి పాలెంలో పేకాట శిబిరాలపై ఆదివారం కూచిపూడి ఎస్‌ఐ నాగవిశ్వనాథ్ ఆదివారం మెరుపు దాడి చేశారు. ఈ రెండు దాడుల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. జూదరుల వద్ద నుంచి రూ.2,800, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జూదరులపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు



గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధిలో భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పాల పొంగళ్లను పొంగించిన మహిళా భక్తులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ ఆకుల కొండలరావు తగు ఏర్పాట్లు చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

గుడ్లవల్లేరు: ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడ్లవల్లేరులో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము ఆదివారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లు, ఇతర ఆర్థిక పరమైన సమస్యలను త్వరగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమానికి ముందు గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వర్తక, వాణిజ్య వ్యాపారుల సంఘ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పర్యావరణ పరిరక్షణలో వ్యాపారులు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వ్యాపారులు పర్యావరణానికి హాని కలిగించే పాలిథిన్ కవర్లను నిషేధించాలన్నారు. పేపర్ సంచులు, క్లాత్ సంచులు, భూమిలో కలిసిపోయే కవర్లను వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. ఎంపీడీఓ టి.విజయసారధి, తహసీల్దార్ బి.లోకరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటకు చీరలే రక్ష




తోట్లవల్లూరు: మొక్కజొన్న పైరును కాపాడుకునేందుకు అన్నదాతలు వినూత్న పద్ధతులు ఆచరిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది నాలుగు వేల ఎకరాలకుపైగా మొక్కజొన్న పంట సాగయ్యింది. పంటకాలం పూర్తి కావస్తుండటంతో ప్రస్తుతం పైరు కోత దశకు చేరుకుంది. పశు,పక్షాదుల నుంచి పంటను కాపాడుకునేందుకు రైతులు చీరలు, మెరుపు పేపర్లను వినియోగిస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పంటను పండించామని, కోత పూర్తయ్యే వరకు కాపాడుకోవటం కష్టతరంగా మారిందని రైతులు అంటున్నారు.

పేదలకు అన్నదానం



గుడివాడ టౌన్: ఆర్‌కే వారియర్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మందపాడులోని నిరాశ్రయుల ఆశ్రమంలోని అనాథలకు భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కే వారియర్స్ కన్వీనర్ ఎస్.రామకృష్ణ(ఆర్కే) మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. కుంభం లిషిత వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వారియర్స్ సభ్యులు ఎల్. రాంబాబు, జి. చరణ్, కె. రామ్మోహన రావు, కె. అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పామర్రు: మండలంలోని కొమరవోలు, కనుమూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ సురేష్ ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనులతో నిరుద్యోగులకు ఆసరాగా ఉంటోందన్నారు. పనులను నాణ్యతగా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలన్నారు. కచ్చితమైన కొలతలతో పనులు చేయాలన్నారు. మండలంలోని 25 పంచాయతీల్లో 1,560 మంది కూలీలు పనులను నిర్వహించారని తెలిపారు. ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

వేల్పూరు వంతెనకు మోక్షమెప్పుడో..?



ఇప్పటికీ అలాగే ఉన్న దెబ్బతిన్న వేల్పూరు వంతెన



వేల్పూరు వంతెన వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

పమిడిముక్కల: గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు వేల్పూరు వద్ద మురుగుకాలువపై ఉన్న వంతెన వద్ద రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీంతో వంతెన ప్రమాదకరంగా మారి కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాకపోకలు సాగించేందుకు వీలుగా వంతెన పక్కన అప్రోచ్ రోడ్డు వేశారు. ఇది జరిగి నాలుగు నెలలైనా వంతెన పనులు మాత్రం ప్రారంభం కాలేదు. హనుమంతపురం, ముళ్లపూడి, ఐనంపూడి, వేల్పూరు గ్రామాల ప్రజలు ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. పెద్ద వాహనాలు వచ్చేందుకు వీలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్లుగా ప్రమాదకరంగా మారిన వంతెన తొలగించి, కొత్తది నిర్మించాలని కోరుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. త్వరితగతిన ప్రమాదకరంగా ఉన్న వంతెనను తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.

గుంతలమయంగా రహదారి

ముళ్లపూడి నుంచి కనుమూరు వరకు రహదారి రాళ్లులేచి, గుంతలు పడి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిపై రాకపోకలు సాగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంక్రాంతి లోపు గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టి పూర్తి చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. రహదారిని పలు చోట్ల పాక్లెయిన్‌తో చదును చేసి వదిలేశారు. రహదారికి మరమ్మతులు మాత్రం చేపట్టలేదు. సంక్రాంతి వెళ్లి ఉగాది వస్తున్నా రోడ్ల పరిస్థితి ఏ మాత్రం మారలేదు.



చదును చేసి వదిలేసిన ముళ్లపూడి-కనుమూరు రోడ్డు

వంతెన పనులు ప్రారంభించాలి



నాలుగు నెలల క్రితం వంతెన పూర్తిగా దెబ్బతింది. వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. వెంటనే పనులు ప్రారంభించాలి. లేకుంటే వర్షాకాలంలో పనులు చేయడం కష్టం. – తిరుమలశెట్టి బోసుబాబు, వేల్పూరు, వైఎస్సార్ సీపీ కార్యనిర్వాహక కార్యదర్శి

రహదారికి మరమ్మతులు చేపట్టాలి



ముళ్లపూడి నుంచి కనుమూరు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. గుంతలమయంగా మారింది. పెద్ద వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. రహదారికి మరమ్మతులు చేపట్టాలి. – పక్కాల అంజిబాబు, సర్పంచ్, ముళ్లపూడి

నెలాఖరుకు వంతెన పనులు ప్రారంభం

ఈ నెలాఖరుకు వంతెన పనులు ప్రారంభిస్తాం. నిధులు మంజూరు, టెండర్ ప్రక్రియ పూర్తయింది. త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం. రోడ్ల మరమ్మతులు కూడా చేపడతాం. – బలరామ్, ఆర్‌అండ్‌బీ, డీఈఈ

కూటమి ప్రభుత్వం కుట్రలు



కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఎంపీటీసీ సభ్యులు, కుటుంబ సభ్యులు

కైకలూరు: మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎన్నికల్లో తమ పార్టీ సభ్యులను కూటమి నాయకులు భయభ్రాంతులకు గురుచేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన వైఎస్సార్ సీపీ గుర్తుతో గెలిచిన ఎంపీటీసీ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కైకలూరు మండల పరిషత్ ఎన్నికల సమయంలో మొత్తం 22 స్థానాలకు ఒక్కటి మాత్రం టీడీపీ గెలిచిందన్నారు. కైకలూరు – 5వ సెగ్మెంట్ సభ్యుడు వైఎస్సార్ సీపీ వైస్ ఎంపీపీ తెంటు సత్యనారాయణ మరణంతో ఎన్నిక అనివార్యమైందన్నారు. మొత్తం 21 మంది ఎంపీటీసీ సభ్యులలో ఒకరి మరణంతో సంఖ్య 20కి చేరిందన్నారు. కొట్టాడ ఎంపీటీసీ సభ్యురాలు సిద్దాబత్తిన సువర్ణమ్మ విదేశాల్లో ఉంటున్నారన్నారు. మిగిలిన 19 మంది ఎంపీటీసీలలో 10 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు పార్టీ పట్ల అంకితభావంతో ఉన్నారన్నారు. ఈ నెల 27 ఉదయం 11 గంటలకు మండల పరిషత్‌లో కార్యాలయంలో చేతులెత్తే పద్ధతిలో వైస్ ఎంపీపీ ఎన్నిక జరగనుందన్నారు. అయితే కూటమి నేతలు సభ్యులను మభ్యపెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీని వీడి కూటమిలో చేరుతున్న ఎంపీటీసీ సభ్యులను ఎన్నిక పూర్తయిన తర్వాత వాడుకొని వదిలేస్తారనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో 10 స్థానాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, వారి తరపు బంధువులు హాజరయ్యారు.

‘స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర’లో భాగస్వాములు కావాలి



డస్ట్‌బిన్‌లను అందించిన ఎమ్మెల్యే రాము

గుడ్లవల్లేరు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరులో ఆదివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళుతూ తడి చెత్త–పొడి చెత్త నిల్వల డస్ట్ బిన్‌లను ప్రజలకు ఎమ్మెల్యే రాము అందజేశారు. పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ టి.విజయసారధి, తహసీల్దార్ బి.లోకరాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్య చౌదరి, గుడ్లవల్లేరు ఎస్ ఈఆర్‌ఎం విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పొట్లూరి రవి, మాజీ లయన్స్ చైర్మన్ పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మండవల్లి: మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గుడివాడ గణేష్, కెరియర్ గైడెన్స్ డైరెక్టర్ సూదాబత్తుల విజయ్‌కుమార్, ముళ్లపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాద బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు ఆదివారం అందజేశారు. చెన్ను వెంకటేశ్వరరావు కుమారుడు వెంకటేష్‌కు రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లలో రాడ్లు వేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో మానవతా స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి వైద్య ఖర్చులకు అందజేసింది.

విధుల్లో అలసత్వంపై కార్యదర్శికి షోకాజ్ నోటీసు

తోట్లవల్లూరు: ప్రొద్దుటూరు గ్రామంలోని చెత్త, వ్యర్థాలను తెచ్చి మండలంలోని బొడ్డపాడు పరిధిలో గల పుల్లేరు కాలువ కట్టపై వేయటం, దగ్ధం చేయటంపై ఆ గ్రామ కార్యదర్శికి అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ తెలిపారు. చెత్త, వ్యర్థాల నిర్వహణలో ప్రొద్దుటూరు పంచాయతీ సిబ్బంది అనుసరిస్తున్న వైఖరి, గ్రామస్తులను ఇబ్బంది పెడుతున్న తీరుపై కలెక్టర్, డీపీఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న కార్యదర్శికి కంకిపాడు ఈఓపీఆర్‌డీ కిరణ్మయి సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు శివశంకర్ తెలిపారు. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారని పేర్కొన్నారు.

చురుగ్గా కల్వర్టు నిర్మాణ పనులు



తోట్లవల్లూరు: స్థానిక సినిమాహాలు బజారు రోడ్డులో డ్రెయినేజీ కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. సుదీర్ఘకాలంగా డ్రెయినేజికి కల్వర్టు లేక ఈ రోడ్డులో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో కల్వర్టు నిర్మాణంపై గ్రామ సర్పంచ్ పెనుమత్స రాధిక దృష్టి సారించారు. పంచాయతీ నిధులు రూ.2.50 లక్షల వ్యయంతో డ్రెయినేజికి కల్వర్టు నిర్మాణ పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. కల్వర్టు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. పనులను సర్పంచ్ రాధికతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బారావు, కార్యదర్శి రవికుమార్ పర్యవేక్షిస్తున్నారు.

సంక్షిప్తం వార్తలు

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి

కైకలూరు: విదేశీ, స్వదేశీ పక్షుల అందాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని పలువురు పక్షి ప్రేమికులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల విహార కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి ఎక్కువగా యాత్రికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ అరుదైన పెలికాన్, పెయింటెడ్ స్టాక్ పక్షుల అందాలను వీక్షించారు. బోటు షికారు వద్ద రద్దీ కనిపించింది. సమీపంలోని పక్షి నమూనా మ్యూజియంను సందర్శించారు. అటవీ శాఖ అధికారులు కొల్లేరు పక్షుల విశేషాలు, భౌగోళిక పరిస్థితులు, చేపల సాగు వంటి అంశాలను వివరించారు.

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్ర గాయాలు

పామర్రు: విహారయాత్ర నుంచి తిరిగి వస్తున్న బస్సు ప్రమాదానికి గురై విద్యార్థి బృందంలో ఉన్న స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయురాలు రావి లక్ష్మీకుమారికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు వద్ద ప్రధాన రహదారిపై విహారయాత్ర బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలైన విద్యార్థుల బృందంతో మూడు బస్సుల్లో చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల్లో విహార యాత్రకు సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 12న బయలుదేరారు. విహారయాత్ర ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో ఒక బస్సు ఈ నెల 22వతేదీ శనివారం ఉదయం ప్రకాశం జిల్లాలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో పామర్రు జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయురాలు లక్ష్మీకుమారి, పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. లక్ష్మీకుమారికి తీవ్ర గాయాలు కావడంతో ప్రకాశం జిల్లాలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలిపారు.

ప్రతి కుటుంబం అక్షరాస్యత సాధించాలి



ముదినేపల్లి రూరల్: ప్రతి కుటుంబం అక్షరాస్యత సాధించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని వెలుగు సీసీ సత్యవర్ధన్ అన్నారు. మండలంలోని అల్లూరులో ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి అవగాహన సదస్సు ఆదివారం జరిగింది. సమావేశంలో సీసీ మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపుల్లోని సభ్యుల కుటుంబాలు నూరు శాతం అక్షరాస్యత సాధిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రతి కుటుంబం అక్షరాస్యతపై శ్రద్ధ చూపాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. గ్రామప్రముఖుడు దావు నాగరాజు అక్షరాస్యత ప్రాముఖ్యత గురించి సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో డ్వాక్రా బుక్‌కీపర్ పంతగాని కమల, అంగన్వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, దాసరి శ్రీను, కాసాని బాల ఏసు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు



కైకలూరు: నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్లతో మట్టిని జిల్లా సరిహద్దులు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎండీ.ఇబ్రహీం హెచ్చరించారు. చినరామవరం వద్ద పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడుకు తరలిస్తోన్న మట్టి ట్రాక్టర్లు, పొక్లయిన్ పనులను వీఆర్వో సురేష్‌తో ఆదివారం నిలుపుదల చేయించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఎట్టి పరిస్థితుల్లో ట్రాక్టర్లు, టిప్పర్లు నియోజకవర్గ సరిహద్దులు దాటితే సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని ఆదేశించారని పేర్కొన్నారు.

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



స్వామి సన్నిధిలో విరాళమందిస్తున్న దాతలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోశారు. పాలపొంగళ్ల శాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. స్వామి వారి నిత్యాన్నదానానికి దాతలు రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. బంటుమిల్లికి చెందిన యడ్లపల్లి నాగేశ్వరరావు, కమల దంపతులు విరాళాన్ని చెక్కు రూపేణా స్వామిసన్నిధిలో అర్చకులకు అందజేసినట్లు సహాయ కమిషనర్ తెలిపారు.

ఘనంగా గంగానమ్మ నెల సంబరాలు



ఊరేగింపుగా వస్తున్న భక్తుల ముందు కళాకారులు ప్రదర్శన



ఆలయంలోని గంగానమ్మ అమ్మవారు

పామర్రు: గంగానమ్మ తల్లి నెల సంబరాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని 108 జల బిందెలతో అభిషేకాలను చేసి, అనంతరం పసుపు కుంకుమలతో అలంకరించారు. నూతన వస్త్రాలను అమ్మవారికి ధరింపజేశారు. ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను వండి అమ్మవారికి నివేదనలు సమర్పించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆరేపల్లి నాగ రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి రాకేష్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో స్థానిక విజయవాడరోడ్డులోని ఆరేపల్లి కల్యాణ మండపం నుంచి మేళ తాళాలతో కనక తప్పెట్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, స్థానికులు బొమ్మారెడ్డి మాధవరెడ్డి, దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులకు ఘన నివాళి



గుడివాడలో భగతసింగ్, సుఖ్‌దేవ, రాజ్‌గురుకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: భారతదేశాన్ని బ్రిటిష్ పాలకుల నుంచి విడిపించేందుకు తమ ప్రాణాలనే ఫణంగా పెట్టిన స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు అని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వాతంత్ర సమరంలో ధీరులుగా పోరాడి ఉరితాళ్లను చిరునవ్వుతో స్వాగతించిన గొప్ప యోధులు అని కొనియాడారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీఐటీయూ కార్యదర్శి లక్ష్మణరావు, టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లంకపల్లి లాజరు, నవభారత్ క్లాత్ స్టోర్స్ అధినేత గఫార్, సాహితీ స్రవంతి కన్వీనర్ లంకా సురేంద్ర, ఆర్. కొండ తదితరులు పాల్గొన్నారు.

పెదపూడిలో..



పెదపూడిలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళి

పెదపూడి(మొవ్వ): మొవ్వ మండలం పెదపూడిలోని చలసాని కాంచన రావు భవనంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, నాయకులు కొండా నాగేశ్వరరావు, బోరుకాటి నరిసింహారావులు భగత్ సింగ్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

కనుల పండువగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న భక్తులు



అమ్మవార్లు



స్వామి ఉత్సవమూర్తి

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూసమేత వెంకటేశ్వర స్వామి కల్యాణాన్ని ఆదివారం మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు.

ఘనంగా మసీహ్ మౌవూద్ దినోత్సవం



ప్రసంగిస్తున్న మత గురువు

భట్లపెనుమర్రు(మొవ్వ): మొవ్వ మండలం భట్లపెనుమర్రు మసీదులో అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో మసీహ్ మౌవూద్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు గురువు మహమ్మద్ యాకుబ్ పాషా ప్రసంగిస్తూ ఇస్లాం పునరుద్ధరణకు ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా అనుచరులతో కలిసి బై అత్ (ప్రతిజ్ఞ) తీసుకుని, ధర్మ ప్రచారాన్ని ప్రారంభించిన రోజని తెలిపారు. పవిత్ర ఖురాన్, ప్రవక్త ముహమ్మద్ ముస్తఫా ధర్మాన్ని పునరుద్ధరించేందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అవతరించారని పేర్కొన్నారు. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ సభ్యులు తమ సామర్థ్యానికి అనుగుణంగా ధర్మ ప్రచారంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. షేక్ హైదర్ వలీ సాహెబ్ ప్రసంగిస్తూ ప్రతి అహ్మదీయుడు ఇస్లాం సేవలో మరింతగా నిమగ్నమవ్వాలని కోరారు.

నడకతో మధుమేహం నియంత్రణ



కైకలూరు: మధుమేహం నియంత్రణ కోసం ప్రతి రోజు గంట సమయం నడక ఉత్తమ మార్గమని మెడికేర్ హాస్పిటల్ సుగర్ వ్యాధి నిపుణురాలు డాక్టర్ జ్ఞానస పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగువ ఆధ్వర్యంలో సుగర్ వ్యాధి నియంత్రణపై అవగాహన కోసం కైకలూరులో మూడు కిలోమీటర్ల నడక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన సమావేశంలో డాక్టర్ జ్ఞానస మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీలు పాడవడం వంటివి ఎక్కువవుతున్నాయన్నారు. వీటికి మూలకారణం డయాబెటీస్‌గా నిర్ధారణ అవుతోందన్నారు. టైప్–2 డయాబెటీస్ జీవన విధానం, ఆహారపు అలవాట్లు వల్ల వస్తోందన్నారు. తరచుగా సుగర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కైకలూరు మగవ అధ్యక్షురాలు ఎస్.మాధవి, ఉపాధ్యక్షురాలు గుర్రం మానస, కార్యదర్శి కె.మాధవి, ట్రెజరర్ ఎం.మాధవి, సభ్యులు పాల్గొన్నారు.